సాక్షి కర్నూలు

బుధవారం : 8 : ఫిబ్రవరి : 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శనగల బసవన్నగా పేరుపొం దిన నందీశ్వరునికి, శ్రీశైల క్షేత్ర పాలకునిగా ప్రసిద్ధిగాంచిన శ్రీ బయలువీరభద్ర స్వామికి మంగళవారం శాస్త్రోక్తంగా పూజలను నిర్వహించారు.



లక్ష విస్తరాకుల విరాళం

శ్రీశైలంటెంపుల్: చీరాలకు చెందిన శ్రీభ్రమరాంబికా సేవా సమితి వారు శ్రీశైల దేవస్థానానికి రూ. 2.50 లక్షల విలువైన లక్ష విస్తరాకులను విరాళంగా అందజేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,614.08
టీఎంసీల సామర్థ్యం	: 105,788
ప్రస్తుతం	: 46,266
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 9,732

న్యూస్‌రీల్

కూలీల హాజరు పెంచండి

కర్నూలు(అగ్రికల్చర్): ఉపాధి పనులకు కూలీల హాజరును పెంచాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి క్లస్టర్ ప్రత్యేక అధికారులను ఆదేశించారు. ప్రతి రోజు లక్ష మంది విధిగా హాజరయ్యేలా ఏపీడీ, ఏపీవో, సాంకేతిక సహాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం తన చాంబరులో ఏపీడీలు, క్లస్టర్ల ప్రత్యేక అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఉపాధి పనులకు లేబర్ పెంచడంపై విధి విధానాలను వివరించారు. వ్యవసాయ పనులు ముగిసినందుకు గ్రామాల్లో ఉపాధి పనులు పెద్ద ఎత్తున చేపట్టి వలసలను నియంత్రించాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం రోజుకు 60 వేల మంది వరకు ఉపాధి పనులకు వస్తున్నారన్నారు. పనులకు హాజరైన వారి మస్టర్‌ను నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్) ద్వారా తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క కూలీకి రోజుకు రూ.257 వేతనం పడే విధంగా పనులు చేయించాలన్నారు. సమావేశంలో ఏపీడీలు లక్ష్మన్న, కృష్ణమోహన్, ప్లాంటేషన్ మేనేజర్ నందకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

బాలోత్సవం లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): ఆనందం, ఉత్సాహం, ఉల్లాసం నినాదంతో నిర్వహించబోతున్న బాలోత్సవం–2023 లోగోను కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆవిష్కరించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. బాలోత్సవానికి తగు సహాయ, సహకారాలు అందిస్తామని కలెక్టర్ చెప్పారు. లోగో ఆవిష్కరణలో ప్రధాన కార్యదర్శి శేషయ్య, నిర్వహణ కమిటీ ప్లానింగ్ కన్వీనర్ కెంగార మోహన్, కల్చరల్ కన్వీనర్ ఎంపీ బసవ రాజు పాల్గొన్నారు.

రేపటిలోగా స్పాట్ బిల్లింగ్ పూర్తి కావాలి

కర్నూలు(రాజ్‌విహార్): నెలవారీ విద్యుత్ బిల్లులు జారీ చేసే స్పాట్ బిల్లింగ్ ప్రక్రియ ఈనెల 9వ తేదీలోపు పూర్తి చేయాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. మంగళవారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లులు జారీ ప్రక్రియలో ఎలాంటి సమస్య లేకుండా గడువులోపు పూర్తి చేయాలని చెప్పారు. మీటర్ రీడర్ ప్రతి ఇంటికి వెళ్లి, మీటర్‌ను డిజిటల్ యాప్ ద్వారా స్కాన్ చేసి రీడింగ్ చేయాలని చెప్పారు. ఎక్కడైనా మీటర్లు స్కాన్ కాని పక్షంలో వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని, డోర్ లాక్ బిల్లింగ్‌లో డోర్ లాక్ ఆప్షన్ ఉండేలా చూడాలని సూచించారు. అలాగే బిల్లుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని, డిమాండ్ నోటీసుల మేరకు 100 శాతం రాబట్టాలన్నారు. దీనిపై ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఏఈలు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం, ఇతర సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే స్పందించి పునరుద్ధరించాలని చెప్పారు.

వన్యప్రాణుల దాహం తీర్చేందుకు చర్యలు

రుద్రవరం: అటవీ ప్రాంతంలోని వన్యప్రాణుల దాహం తీర్చేందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు సెక్షన్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. చెలిమ రేంజిలోని పెద్దకంబలూరు సెక్షన్ పరిధిలో ఇదివరకే నిర్మించిన సాసర్ పిట్లలో మంగళవారం ట్యాంకర్‌తో నీటిని తీసుకెళ్లి నింపారన్నారు. 15 రోజులకోసారి సాసర్ పిట్లలో నీరు నింపుతూ ఉంటామన్నారు. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ముందస్తుగా సాసర్ పిట్లను నీటితో నింపుతున్నట్లు చెప్పారు. నీటి కోసం జంతువులు అడవి నుంచి బయటకు వచ్చి ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు.



ఈ-బుక్ చదువుతుంది

- పుస్తకాలను చదివి వినిపిస్తున్న కొన్ని వెబ్‌సైట్లు, యాప్‌లు
- అందుబాటులో వేల పుస్తకాలు
- టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్న విద్యార్థులు

ఏదైనా మంచి పుస్తకం చదవాలంటే బుక్‌షాప్‌కు వెళ్లి కొనుక్కోవాలి. ఆర్థిక స్థోమత లేదంటే లైబ్రరీకి వెళ్లి తెచ్చుకోవాలి. లేదంటే అద్దెకు తెచ్చుకోవాలి. ఇదంతా గతం. ఇప్పుడంతా ఆన్‌లైన్ రాజ్యమేలుతున్న తరుణంలో పుసక పఠనం కూడా అక్కడికే వెళ్లిపోయింది. పాఠకులకు ఎలాంటి పుస్తకాలు కావాలన్నా ఒక క్లిక్ కొడితే చాలు క్షణాల్లో ప్రత్యక్షమవుతున్నాయి. కేవలం చూసి చదవడమే కాదు మీకు కావాలంటే చదివి వినిపిస్తున్నాయి కూడా!

కర్నూలు(హాస్పిటల్): మారుతున్న కాలానికి అనుగుణంగా, టెక్నాలజీకి తగినట్టు పాఠకుల అభిరుచి మారుతోంది. విద్యార్థులకు సైతం ఆన్‌లైన్ పాఠాలు వచ్చిన ఈ రోజుల్లో పెద్దలకు మాత్రం ఏ తక్కువ అన్నట్లు పుస్తకాలు వివిధ వైబ్‌సైట్‌లలో అందుబాటులో ఉంచారు. ఒకటి కాదు రెండు కాదు.. కొన్ని లక్షల పుస్తకాలు ఒక క్లిక్ దూరంలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయి. కొన్ని వెబ్‌సైట్స్ ఉచితంగా, మరికొన్ని కొంత మొత్తాన్ని సబ్‌స్క్రిప్షన్‌గా చెల్లించుకుని పుస్తకాలు అందిస్తున్నాయి. ట్యాబ్‌లు, మొబైల్స్‌లలో టచ్‌స్క్రీన్ సహాయంతో వీటిని సాధారణ పుస్తకాల వల్లే చదువుకోవచ్చు. ఎక్కడ ఆపాలో, తిరిగి ఎక్కడ నుంచి చదవాలో కూడా మార్క్ చేసుకోవచ్చు. పదాలకు అర్థాలను వెతుక్కోవచ్చు. విద్య, వ్యాపారం, ఆధ్యాత్మికం, ఉద్యోగం, వైద్యం, సామాజికం, సాంకేతికం, సాహిత్యం.. ఇలా అన్ని అంశాల గురించి వేలాది పుస్తకాలు అన్ని భాషల్లో అందుబాటులో ఉన్నాయి.

శ్రవణ పుస్తకం

ఈ-బుక్స్, పీడీఎఫ్‌లతో పాటు ఇప్పుడు చదివి వినిపించే పుస్తకాలు కూడా వచ్చేశాయి. చదవడం కంటే వినడం వల్లే ఎక్కువ గ్రహిస్తామన్న నానుడిని బట్టి ఇది ఉద్భవించిందేమో గానీ దీనిపట్ల పాఠకులు ఎక్కువ ఆసక్తి చూపిస్తున్నారు. వెబ్‌సైట్లు, యాప్‌లోకి వెళ్లి బుక్స్ డౌన్‌లోడ్ చేసుకోవడం, చదువుకోవడం, వినడం చేస్తున్నారు. ఈ-బుక్ ఆన్ చేసుకుని అది చదివి వినిపిస్తుంటే కుర్చీలో అలా వాలి పడుకుని వింటూ ఇతర లోకాలకు వెళ్లిపోతున్నామని పాఠకులు చెబుతున్నారు.

యానిమేషన్‌కు సంబంధించిన పుస్తకాలు:

https://www.animationmentor.com/resources/e-booksలో లభిస్తాయి.

ఈ-బుక్స్ వల్ల ఉపయోగాలు ఇవీ..

- ➡ ఎప్పుడైనా, ఎక్కడైనా చదువుకోవచ్చు. వినవచ్చు
- ➡ మొబైల్ ఫోన్స్‌లో కూడా చదువుకోవచ్చు.
- ➡ ఏ పుస్తకాలైనా సరే క్షణాల్లో ఇంటర్‌నెట్‌లో చదువుకోవచ్చు.
- ➡ ముఖ్యాంశాలను డిజిటల్‌గా హైలెట్ చేసుకోవచ్చు. పేజ్ మార్కింగ్ చేసుకోవచ్చు.
- ➡ ఇందులో ఒకే ఒక్క ఇబ్బంది ఏమంటే మనకు పవర్, ఇంటర్‌నెట్ ఉండాలి.
- ➡ ఇటీవల కాలంలో విద్యార్థులు ఎలాంటి వ్యాసాలకైనా, ప్రోగ్రామ్స్‌కైనా CHATGPT వాడుతున్నారు.

ఈ-బుక్స్ లభించే వెబ్‌సైట్ల వివరాలు



ప్రాజెక్టు గుటెంబర్గ్: ఈ వెబ్‌సైట్‌లో 45వేలకు పైగానే పుస్తకాలు ఉన్నాయి. ఇవి వివిధ ఫైల్ ఫార్మేట్స్‌లో అందుబాటులో ఉంటాయి.

ఓపెన్ లైబ్రరీ: ఇందులో ఒక మిలియన్ పుస్తకాలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయి. ఇందులో పుస్తకాలను వినియోగదారులు వాడుకోవడమే గాక వారు రాసిన పుస్తకాలు కూడా అప్‌లోడ్ చేసుకోవచ్చు.

గూగుల్ ఈ-బుక్ స్టోర్: ప్రముఖులు రాసిన పుస్తకాలు, సాహిత్య, టెక్నాలజీ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

బుక్‌బూల్: విద్య, వ్యాపారానికి సంబంధించిన పుస్తకాలు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

లైబ్రివాక్స్: ఆడియోతో కలిగిన ఈ-పుస్తకాలు, పురాతన, చరిత్రాత్మక పుస్తకాలు ఇక్కడ లభిస్తాయి.

పీడీఎఫ్ బుక్స్ వరల్డ్: ఇక్కడ అన్ని రకాల పుస్తకాలు పీడీఎఫ్ రూపంలో అందుబాటులో ఉన్నాయి.

ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ డిజిటల్ లైబ్రరీ: చిన్నపిల్ల సాహిత్యం, కథలు, నీతి కథల పుస్తకాలు లభిస్తాయి.

అమేజాన్ కిండెల్: త్రీడీ గ్రాఫిక్స్, ఆడియోతో కూడిన వేలకొద్దీ పుస్తకాలు ఇక్కడ లభిస్తాయి.

తెలుగు ఈ-బుక్స్: తెలుగు సాహిత్యం, కవితలు, పురాణాలు, ఇతిహాసాలు, పాటలు, పాఠ్యాంశానికి సంబంధించిన పుస్తకాలు లభిస్తాయి.



ఆన్‌లైన్‌లో లక్షల పుస్తకాలు



అధునాతన విద్యావిధానంలో ఈ-పుస్తకాల పాత్ర చాలా ముందుంది. సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లతో మనకు సౌకర్యవంతమైన ప్రదేశంలో ఆన్‌లైన్‌లో చదువుకోవచ్చు. ఉచితంగా కొన్ని లక్షల పుస్తకాలు ఆన్‌లైన్‌లో మనం డౌన్‌లౌడ్ చేసుకోవచ్చు. మనకు కావాల్సిన వ్యాసం, మ్యాటర్‌ను చాట్ జీపీటీలో టైప్ చేసి అడిగితే వెంటనే వచ్చేస్తుంది.

– ప్రేమ్‌కుమార్ సింగులూరి, ప్రొఫెసర్, డీన్ ఇన్నోవేషన్స్, జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీ, కర్నూలు

ఎంతో ఉపయోగకరం



ఒక విద్యార్థిగా ఈ-బుక్స్ నాకు చాలా ఉపయోగపడుతున్నాయి. ఆన్‌లైన్‌లో నాకు కావాల్సిన సబ్జక్ట్సు ఈ-బుక్‌లో క్షణాలలో డౌన్‌లౌడ్ చేసుకుని చదవగలుగుతున్నాను. ఖర్చులేకుండా ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్స్‌లో ఏ చోట నుండైనా చదివేందుకు సౌకర్యవంతంగా ఉంది. ఫ్రెండ్స్‌కు షేర్ చేయడం కూడా సులభం. ఆధునిక టెక్నాలజీని జోడించి ఈ-బుక్స్‌లో ఆడియో, మల్టీమీడియా గ్రాఫిక్స్ ఉండటం వల్ల మాకు విషయ సంగ్రహణ చాలా సులభంగా ఉంది. ఈ టెక్నాలజీకి మా జోహారులు.

– లక్ష్మీశ్రావ్య, ఇంజినీరింగ్ విద్యార్థిని, కర్నూలు

ఆన్‌లైన్‌లో ఈ-పుస్తకాలు వింటాను



ఆన్‌లైన్‌లో ఈ-బుక్స్ చాలా బాగుంటాయి. చదవడానికి కష్టంగా ఉన్న వారికి ఇవి ఎంతో ఉపయోగకరం. నా మటుకు ఎక్కువ పుస్తకాలు ఆన్‌లైన్‌లో వింటూ ఉంటాను. ఎందుకంటే వినడం వల్లే ఎక్కువ విషయాలను గ్రహిస్తాం. పుస్తకంలో ఎక్కడ కావాలంటే అక్కడ ఆపుకుని, అనుమానం వచ్చిన చోటకు వెనక్కి వెళ్లి మళ్లీ విని అర్థం చేసుకునే సౌలభ్యం కూడా ఉంటుంది. నేను ఎక్కువగా సామాజిక అంశాలు, సైన్స్, మెడికల్‌కు సంబంధించిన పుస్తకాలు వింటాను.

– వెంకట్, కర్నూలు

బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- మహా శివరాత్రి ఉత్సవాలకు బ్రహ్మాండమైన ఏర్పాట్లు
- భక్తులు వేచి ఉండేందుకు 26 కంపార్ట్‌మెంట్లు
- అడుగడుగునా చలువ పందిళ్లు
- 29 ఎకరాల్లో వాహనాల పార్కింగ్ ప్రాంతాలు



శ్రీశైలంలో ఏర్పాటు చేసిన శీఘ్ర, అతిశీఘ్ర, శివదీక్షా స్వాముల ప్రత్యేక క్యూలు

శ్రీశైలంటెంపుల్ : ఇల కైలాసమైన శ్రీగిరి క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం సర్వం సిద్ధం చేసింది. ఈ నెల 11 నుంచి 21 వరకు జరిగే ఉత్సవాల్లో భక్తులకు మెరుగైన వసతులు అందుబాటులోకి తెచ్చింది. 11రోజుల పాటు వైభవంగా నిర్వహించే ఉత్సవాలను తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు లక్షలాదిగా తరలివస్తారు. రోజుకు 80 వేల మంది చొప్పున భక్తులు, మహాశివరాత్రి, రథోత్సవం రోజు 2 లక్షల మంది క్షేత్రంలో ఉంటారని, 11రోజుల్లో మొత్తం సుమారు 8 లక్షలకు పైగా భక్తులు తరలివస్తారని అధికారుల అంచనా. ఈ మేరకు ఏర్పాట్లలో ఎటువంటి లోటు రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఓ వైపు ప్రతిరోజు శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు విశేషంగా వాహనసేవలు, పూజలు సంప్రదాయబద్ధంగా నిర్వహించడం, మరో వైపు భారీగా తరలివచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేశారు.

మల్లన్న దర్శనం ఇలా..

బ్రహ్మోత్సవాల సందర్భంగా ఉచిత దర్శనం, శీఘ్రదర్శనం (రూ.200), అతి శీఘ్ర దర్శనం(రూ.500), కంకణాలు ధరించి వచ్చిన పాదయాత్ర భక్తులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. రద్దీ కారణంగా భక్తులందరికీ ఈ నెల 11నుంచి 21 వరకు మల్లన్న అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తున్నారు. ఉచిత దర్శన భక్తులు వేచి ఉండేందుకు 14 కంపార్ట్‌మెంట్లు, శీఘ్రదర్శనం భక్తులకు 8, శివదీక్షా భక్తులకు 4 కంపార్ట్‌మెంట్లు ఏర్పాటు చేశారు. అలాగే ఉత్సవాలకు వచ్చే లక్షలాది మంది భక్తుల సౌకర్యార్థం క్షేత్రపరిధిలోని పలు చోట్ల చలువ పందిర్లు ఏర్పాటు చేశారు.

ఆన్‌లైన్‌లో దర్శన టికెట్లు..

ఈ నెల 11 నుంచి 21 వరకు శీఘ్రదర్శనం (రూ.200) టికెట్లు రోజుకు 5 వేలు, అతిశీఘ్ర దర్శనం (రూ.500) రోజుకు 2వేల టికెట్లు ఆన్‌లైన్‌లో లభిస్తాయి.

జ్యోతిర్ముడి సమర్పణకు ప్రత్యేక ఏర్పాట్లు

పాతాళగంగ మార్గంలోని శివదీక్షా శిబిరాల్లో భక్తులు ఇరుముడి సమర్పణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ నెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జ్యోతిర్ముడి సమర్పణకు ఏర్పాట్లు చేశారు.

పార్కింగ్‌కు ఆరు ప్రదేశాలు..

క్షేత్ర పరిధిలో మొత్తం 29 ఎకరాల విస్తీర్ణంలో వాహనాల పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆగమ పాఠశాల ఎదురుగా, యజ్ఞవాటిక, వాసవీవిహార్ వద్ద కార్ పార్కింగ్, రింగ్ రోడ్డు వద్ద ఏపీఎస్, తెలంగాణ, కర్ణాటక ఆర్టీసీ బస్సులకు ప్రత్యేకంగా పార్కింగ సౌకర్యం కల్పించారు. అలాగే ఔటర్ రింగ్‌రోడ్డు వెంబడి 3వేల వాహనలను పార్కింగ్ చేసుకునే విధంగా చర్యలు చేపట్టారు. టూరిస్టు బస్సులు యాత్రిషెడ్ల వద్ద పార్కింగ్‌కు ఏర్పాటు చేశారు.

సమన్వయంతో విజయవంతం చేస్తాం



శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేస్తాం. గత ఏడాది కంటే ఈ ఏడాది అదనంగా ఏర్పాట్లు చేశాం. జ్యోతిర్ముడి కలిగిన శివభక్తులకు ఈ నెల 15వ తేదీ వరకు మాత్రమే మల్లన్న స్పర్శదర్శనం కల్పిస్తున్నాం. శివదీక్షా భక్తులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశాం. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం.

– ఎస్.లవన్న, శ్రీశైల దేవస్థానం ఈఓ

భూమి కొనుగోలు చెల్లింపులపై ఆరా

- 'సాక్షి' కథనంపై స్పందించిన ఎస్సీ కార్పొరేషన్ జీఎం సునీల్‌రాజ్



జీఎంకు వినతి పత్రం అందిస్తున్న వెంకటేష్

కర్నూలు(అర్బన్): షెడ్యూల్డు కులాల ఆర్థిక సేవా సహకార సంస్థ ఆధ్వర్యంలోని భూమి కొనుగోలు పథకంలో చోటు చేసుకున్న పరిణామాలపై కార్పొరేషన్ జీఎం సునీల్‌రాజ్ స్పందించారు. ఆదోని మండలం చిన్న గోనేహాల్, చిన్న హరివాణం గ్రామాల్లో భూమి లేని నిరుపేద ఎస్సీలకు భూములు రిజిస్ట్రేషన్ చేయించకుండానే వాటిని విక్రయించిన రైతులకు రూ.4.65 కోట్లు చెల్లించిన విషయంపై ఈ నెల 3వ తేదీన సాక్షి దినపత్రికలో ' పథకం పారి... చేతులు తడిసి ' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీని ఆధారంగా బాధ్యులపై చర్యలు చేపట్టాలని మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం. వెంకటేష్ మంగళవారం అమరావతిలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో జీఎం సునీల్‌రాజ్‌ను కలిసి పేపర్ క్లిప్పింగ్‌తో పాటు వినతి పత్రం అందించారు. ఈ నేపథ్యంలోనే జీఎం స్థానిక ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఎస్ శ్రీనివాసకుమార్‌కు ఫోన్ చేసి ఆయా గ్రామాల్లో భూమి కొనుగోలు పథకం అమలుపై ఆరా తీశారు. ఆయా గ్రామాల్లో భూములను తీసుకునేందుకు సిద్ధంగా ఉన్న దళితులకు భూములను వెంటనే రిజిస్ట్రేషన్ చేయించాలని, ఎవ్వరూ ఆసక్తి కనబరచకపోతే రైతులకు చెల్లించిన ప్రభుత్వ సొమ్మును రికవరీ చేయాలన్నారు. ఈ నేపథ్యంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాట్లాడుతూ ఇప్పటికే ఈ విషయానికి సంబంధించిన పూర్తి సమాచారం ఎండీ దృష్టికి తీసుకుపోయామని, తాజాగా కార్యాలయ ఈఓ కూడా ఆదోనికి వెళ్లి తహసీల్దార్‌తో మాట్లాడారని సమాధానం చెప్పారు. ఇదిలా ఉంటే దళితులకు కేటాయించిన భూములు రిజిస్ట్రేషన్ కాకుంటే ఆర్ఆర్ యాక్ట్ అమలు చేసి తీసుకున్న సొమ్మును ప్రభుత్వానికి జమ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు జీఎం ఆదేశించినట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లాకు 27,406 క్వింటాళ్ల విత్తనాలు

- కర్నూలు జిల్లాకు 18199, నంద్యాల జిల్లాకు 9207 క్వింటాళ్లు

కర్నూలు(అగ్రికల్చర్): వచ్చే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉమ్మడి కర్నూలు జిల్లాకు 27,406 క్వింటాళ్ల విత్తనాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో కర్నూలు జిల్లాకు 18199 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాకు 9207 క్వింటాళ్లు కేటాయించింది. జిల్లా యంత్రాంగం పంపిన ప్రతిపాదనల మేరకే విత్తనాలు కేటాయించడం విశేషం. వీటిని సబ్సిడీపై రైతులకు సరఫరా చేయనున్నారు. ఏపీ సీడ్స్ విత్తనాలను సిద్ధం చేస్తోంది. 2022–23 రబీ సీజన్‌లో ఏపీ సీడ్స్ సీడ్ విలేజ్ ప్రోగ్రామ్ కింద వేరుశనగ విత్తనోత్పత్తి చేపట్టింది. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంపిణీకి ఏపీ సీడ్స్ రైతుల నుంచి వేరుశనగ సేకరిస్తోంది.

విత్తనం	కర్నూలు జిల్లా (క్వింటాళ్లు)	నంద్యాల జిల్లా (క్వింటాళ్లు)
వేరుశనగ	15,905	3,560
కందులు	1,080	550
మినుము	25	100
పెసర	5	20
కొర్ర	15	30
దయంచ	978	4,675
పిల్లి పెసర	191	17

జేఈఈ ఫలితాల్లో ప్రతిభ



బి.జయసాయి



ఎ.అనుగ్య



ఎస్.రాహిల్



వి.పవన్‌కుమార్

కర్నూలు సిటీ/నంద్యాల(సిటీ): జేఈఈ మెయిన్స్ తొలి విడత పరీక్షల ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసింది. సోమవారం ఉదయం తుది కీని విడుదల చేసిన ఎన్‌టీఏ మొదటగా పేపర్–1(బీఈ/బీటెక్) ఫలితాలను విడుదల చేసి ఉత్తీర్ణులైన వారి పర్సెంటైల్‌ను ప్రకటించింది. గత నెల 24 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో 5 పరీక్ష కేంద్రాల్లో జేఈఈ పరీక్షలు జరిగాయి. కాగా పేపర్–2(బీ.ఆర్క్/బీ.ప్లానింగ్)పరీక్ష ఫలితాలు వెల్లడి కావాల్సి ఉంది. విడుదలైన ఫలితాల్లో జిల్లాకు చెందిన బి.జయసాయి అత్యధికంగా 99.35 పర్సెంటైల్ సాధించాడు. ఆ తరువాత ఎ.అనుగ్య 99.21 , ఇ.హరిణి 99.20, ఎస్.రాహిల్ 99.16, చిన్నటేకూరు ఏపీ డా.బి.ఆర్ అంబేడ్కర్ గురుకుల ఐఐటీ–మెడికల్ అకాడమీ విద్యార్థి వి.పవన్‌కుమార్ 96.61 పర్సెంటైల్‌తో ప్రతిభ చాటారు.

సత్తాచాటిన ఎస్డీఆర్ విద్యార్థిని

జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్స్‌లో నంద్యాల పట్టణానికి చెందిన ఎస్డీఆర్ విద్యార్థులు ప్రతిభ కనబరచారని ఆ కళాశాల చైర్మన్ కొండారెడ్డి తెలిపారు. జేఈఈ మొదటి దశ పరీక్ష ఫలితాల్లో యశ్వితారెడ్డి 99.74 పర్సెంటిల్‌తో జాతీయ స్థాయిలో సత్తాచాటిందన్నారు. అలాగే కళాశాలకు చెందిన లక్ష్మీప్రియ 97.16, వసంత్ 96.12 పర్సెంటిల్ సాధించారన్నారు.

పట్టుదలతో లక్ష్యాన్ని సాధిస్తా



జేఈఈ మెయిన్స్‌లో 99.74 పర్సంటైల్ రావడం చాలా ఆనందంగా ఉంది. మాది యాళ్లూరు గ్రామం. నాన్న వెంకటేశ్వరరెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారి, అమ్మ సుధారాణి గృహిణి. భవిష్యత్తులో ఐఐటీలో సీటు సాధించి, గూగుల్‌లో ఉద్యోగం చేయాలని ఆశిస్తున్నాను. 1 నుంచి పదవ తరగతి వరకు గుడ్‌షెప్పర్డ్ పాఠశాలలో చదివా. ప్రస్తుతం ఎస్‌డీఆర్ ఆకాంక్ష కళాశాలలో చదువుతూ లెక్చరర్ల ప్రోత్సాహంతో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌పై పట్టు సాధించాను. గూగుల్‌లో జాబ్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా.

– డి.యశ్వితా రెడ్డి

బండలాగుడు పోటీల విజేత నంద్యాల



బండ లాగుతున్న నంద్యాల బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు

కోడుమూరు రూరల్: చౌడేశ్వరీ దేవి తిరుణాలను పురస్కరించుకుని మంగళవారం కోడుమూరులో నిర్వహించిన బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. న్యూ కేటగిరీ విభాగంలో జరిగిన పోటీల్లో నంద్యాల జిల్లా పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు 20 నిమిషాల్లో 5612.5 అడుగుల దూరం బండను లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. అలాగే బేతంచెర్ల బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గోనెగండ్ల గాజుల కుమారస్వామిలకు చెందిన ఎడ్లు 4,554.7 అడుగుల దూరం లాగి 2వ స్థానంలో , శిరివెళ్లకు చెందిన తలారి శరబయ్య వృషభాలు 4,509 అడుగుల దూరం లాగి 3వ స్థానంలో, ఓర్వకల్లు, ప్యాపిలికి చెందిన వెంకటేశ్వర్లు, శివకోటి ఎడ్లు 4,504.2 అడుగుల దూరం బండను లాగి 4 వ స్థానంలో, పత్తికొండకు చెందిన చంద్ర వృషభాలు 4,050 అడుగుల దూరం బండను లాగి 5వ స్థానంలో నిలిచాయి. ఆయా వృషభాల యజమానులకు దాతల సహకారంతో నిర్వాహకులు వరుసగా రూ.60వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30 వేలు, రూ.20 వేల చొప్పున నగదు బహుమతులు అందజేశారు. గ్రామసర్పంచు భాగ్యరత్న, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆలయంలో చోరీకి యత్నం

● పట్టుబడిన దొంగ

బనగానపల్లెరూరల్: బనగానపల్లె పట్టణం కొండపేటలో శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరదేవి ఆలయంలో ఓ దొంగ చోరీకి యత్నించి పోలీసులకు చిక్కాడు. కొండపేటకు చెందిన పెయింటర్ కిట్టు మంగళవారం రాత్రి అమ్మవారి ఆలయానికి చేరకుని పూజరి లేని సమయంలో గర్భగుడిలోకి ప్రవేశించి విగ్రహం వెనుక దాకున్నాడు. గమనించిన ఆలయ అర్చకుడు విష్ణు మోహన్ శర్మ వెంటనే ఆలయ తలుపులు మూసి వేశాడు. భక్తులను పిలిచి దొంగను పట్టుకొని దేహశుద్ధి చేశారు. చివరకు పోలీసులకు అప్పగించారు.

వేధింపులు తాళలేక..



మృతురాలు షేక్ చాంద్‌బీ (ఫైల్)

జూపాడుబంగ్లా: భర్త, అత్తమామల వేధింపులు తాళలేక నందికొట్కూరులో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్‌ఐ ఎన్వీ రమణ తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు మండలం మునగాలపాడు గ్రామానికి చెందిన నజీర్‌మియ్యా కుమార్తె షేక్ చాంద్‌బీ(25)ను ఐదేళ్ల క్రితం నందికొట్కూరులోని బైరెడ్డినగర్ కాలనీకి చెందిన లారీ డ్రైవర్ న్యాయమత్‌ఖాన్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. న్యాయమత్‌ఖాన్ భార్యపై అనుమానంతో నిత్యం వేధించేవాడు. అలాగే అత్త ముర్తుజాబీఖాన్, మామ అల్లిన్యామత్‌ఖాన్‌తో పాటు మరిది, ఆడపడుచు కూడా అతనికి తోడయ్యారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆమె మంగళవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి తండ్రి నజీర్‌మియ్యా ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

కర్నూలు (టౌన్): కర్నూలు నగరంలోని ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఓ యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు... ఈ నెల 3వ తేదీ సున్నంగేరికి చెందిన షేక్ మోసిన్ అనే యువకుడు రాత్రి 9.30 గంటల సమయంలో ఇంటి ఎదురుగా ఉన్న బాలిక ఇంట్లోకి చొరబడి చేయి పట్టుకొని డ్రస్ లాగాడు. దీంతో భయాందోళనకు గురైన ఆ బాలిక గట్టిగా కేకలు వేసింది. ఇంట్లో ఉన్న ఆమె అత్త రావడంతో నిందితుడు పరార్ అయ్యాడు. బాధితురాలి అత్త, బంధువులు నిందితుడి ఇంటికి వెళ్లి గొడవ పడ్డారు. వారందరిని దూషించి బైక్‌ను పగుల కొట్టారు. ఇరుగుపొరుగు రావడంతో బాధితురాలి బంధువులు అక్కడి నుంచి వెళ్లి పోయారు. పెద్దమనుషులు, బంధువులతో కలిసి ఆ బాలిక మంగళవారం ఒకటవ పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అవకతవకలు జరిగినట్లు తేలితే చర్యలు

కర్నూలు(సిటీ): రాయలసీమ యూనివర్సిటీ బోధనేతర సిబ్బంది టైమ్ స్కేల్‌పై వచ్చిన ఆరోపణలను పరిశీలించి, ఉద్యోగులు సమర్పించిన ధ్రువపత్రాల వాస్తవికతను నిగ్గు తేల్చడానికి వర్సిటీ స్థాయిలో కమిటీని నియమించామని యూనివర్సిటీ రిజిస్ట్రార్ సుందరానంద పుచ్చ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూనివర్శిటీ బోధనేతర సిబ్బంది నియామకాలు, టైమ్ స్కేల్ అమలు తదితర విషయాలపై పత్రికల్లో వచ్చిన కథనాలపై ఆయన స్పందించారు. నాన్ టీచింగ్ ఉద్యోగుల ధ్రువీకరణ పత్రాల వాస్తవికతను నిగ్గు తేల్చడానికి నియమించిన కమిటీ అధికారుల నుంచి సమాచారాన్ని సేకరించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఐదారేళ్ల క్రితం జరిగిన విషయాల్లో ఏవైనా అవకతవకలు చోటు చేసుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుత యూనివర్సిటీ ఉన్నతాధికారులు పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కొత్తగా ఏ ఒక్క ఉద్యోగిని చేర్చుకోవడం కాని, టైమ్ స్కేల్ వర్తింపజేయడం కానీ జరగలేదన్నారు.

పోలీస్ కొలువు...శ్రమిస్తే సులువు !

● విడుదలైన ప్రాథమిక రాత పరీక్షల ఫలితాలు
● దేహదారుఢ్య పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు
● సాధన చేస్తే కల నెరవేర్చుకోవచ్చు నంటున్న నిపుణులు, శిక్షకులు



కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం సాధన చేస్తున్న యువకులు (ఫైల్)

కర్నూలు: పోలీసు కావాలన్న కలను నిజం చేసుకునేందుకు యువతీ యువకులు కష్టపడుతున్నారు. ఇటీవల విడుదలైన ప్రాథమిక రాత పరీక్షల ఫలితా లతో పోలీసు నియామక ప్రక్రియలో తొలి ఘట్టం పూర్తయింది.ఈ రాత పరీక్షల్లో పాసైన వారు ఇప్పుడు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఎలాగైనా కానిస్టేబుల్ కొలువు సాధించాలని శారీరక సామర్థ్య (పీఈటీ) పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు.సాధన చేస్తే పోస్టు సాధించడం సులభమని నిపుణులు ,శిక్షకులు చెబుతుండటంతో అభ్యర్థులు తెల్లవారుజామునే మైదానాలకు చేరుకుంటున్నారు. మరికొన్ని రోజుల్లో నిర్వహించే రన్నింగ్, లాంగ్‌జంప్, షాట్‌పుట్ తదితర ఈవెంట్లలో అర్హత పొందేందుకు శ్రమిస్తున్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని ఔట్‌డోర్ స్టేడియం, సిల్వర్‌జూబ్లీ కళాశాల మైదానం వేకువజాము నుంచే సందడిగా ఉంటోంది.

ఈనెల 13 నుంచి స్టేజ్–2 పరీక్షల కోసం దరఖాస్తు...

ప్రిలిమ్స్‌లో అర్హత పొందిన వారికి త్వరలో దేహదారుఢ్య పరీక్షలు (పీఎంటీ, పీఈటీ) నిర్వహించనున్నట్లు పోలీసు నియామక మండలి ప్రకటించింది. స్టేజ్–2 పరీక్షల కోసం ఈనెల 13 నుంచి 20వ తేదీ వరకు పోలీసు నియామక మండలి వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. దేహదారుఢ్య పరీక్షల సమయంలోనే అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కూడా ఉంటుంది.

ఇవీ నిబంధనలు...

- కానిస్టేబుల్ ఉద్యోగాలకు పోటీ పడేవారు శారీరక కొలతల పరీక్షలో అర్హత కోసం పురుషులు 167.6 సెంటీమీటర్లు, మహిళలు 152.5 సెంటీమీటర్ల కంటే తక్కువ ఎత్తు ఉండకూడదు.
- పురుషుల ఛాతీ చుట్టుకొలత 86.3 సెం.మీ కంటే తక్కువ ఉండకూడదు. శ్వాస పీల్చినప్పుడు 5 సెం.మీ మేర విస్తరించాలి.
- మహిళల బరువు 40 కిలోల కంటే తక్కువ ఉండకూడదు.
- దేహదారుఢ్య పరీక్షల్లో పురుషులైతే 8 నిముషాల్లో మహిళలైతే 10 నిముషాల 30 సెకన్లలో 1,600 మీటర్ల పరుగు పూర్తి చేయాలి.
- 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ విభాగాల్లో ఏదో ఒక దాంట్లో అర్హత సాధిస్తే చాలు. నిర్ణీత సమయంలో అవి పూర్తి చేయాలి.

ఫోర్త్ జోన్ పరిధిలో భర్తీ చేసే పోస్టులు ఇలా...

కర్నూలు ఫోర్త్ జోన్ పరిధి (కర్నూలు రేంజ్)లోని చిత్తూరు, అనంతపురం, వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాల్లో 105 ఎస్‌ఐ పోస్టులు, 1,270 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది.

19న ఎస్‌ఐ అభ్యర్థులకు రాత పరీక్ష...

ఎస్‌ఐ ఉద్యోగాల కోసం ఈనెల 19న ప్రాథమిక రాత పరీక్ష నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందుకోసం 19,800 మంది దరఖాస్తు చేసుకోగా వీరికి 39 కేంద్రాల్లో ప్రాథమిక రాత పరీక్ష నిర్వహించనున్నారు.

ఉద్యోగం సాధించాలన్నది కల



మాది తుగ్గలి మండలం ఎద్దులదొడ్డి గ్రామం. ఉద్యోగం సాధించాలన్నది తల్లిదండ్రుల కల. వారి కోరిక మేరకు ఆరు మాసాలుగా కర్నూలులో శిక్షణ పొందుతున్నాను. 2019లో కూడా కానిస్టేబుల్ ఉద్యోగం ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణత సాధించినప్పటికీ మెయిన్స్‌లో విఫలమయ్యాను. కొలువు సాధించాలన్న పట్టుదలతో ఉదయం, సాయంత్రం సాధన చేస్తున్నాను.

– పి.అర్జున్, ఎద్దులదొడ్డి

కఠోర సాధన చేస్తున్నా



పోలీసు ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణత సాధించినందున ఈవెంట్స్‌లో కూడా సత్తా చాటుతానన్న నమ్మకం ఉంది. ఆరు మాసాలుగా పీఈటీ లక్ష్మన్న దగ్గర శిక్షణ పొందుతున్నాను. దాదాపు 200 మందికి ఆయన ఉచితంగానే శిక్షణ ఇస్తున్నాడు. ఈసారి ఎలాగైనా పోలీసు కొలువు సాధిస్తాననే నమ్మకం ఉంది.

– పి.నజీర్ బాషా, హోసూరు

ఆత్మవిశ్వాసం పెరిగింది...



ప్రాథమిక రాత పరీక్షలో 122 మార్కులు వచ్చాయి. రెండు సంవత్సరాలుగా ఉద్యోగ సాధన కోసం సన్నద్ధమవుతున్నాను. ఈవెంట్స్‌లో ఫలితం సాధించేందుకు రెండు పూటలా కసరత్తు చేస్తున్నా. ప్రాథమిక పరీక్షలో పాసైనందున ఈవెంట్స్‌లో కూడా విజయం సాధించి ఉద్యోగం సాధిస్తానన్న ఆత్మవిశ్వాసం పెరిగింది.

– బాబునాయక్, సుగాలిమిట్ట

సీఎస్‌ఓ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం సెక్యూరిటీ విభాగంలో ముఖ్య భద్రతా అధికారిగా (చీఫ్‌సెక్యూరిటీ ఆఫీసర్) విధులు నిర్వహించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఈఓ లవన్న మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్పీ హోదాలో పదవీ విరమణ చేసిన ఉద్యోగులు, 65 సంవత్సరాల లోపు వయస్సు ఉన్నవారు, హిందూ మతానికి చెందిన వారు మాత్రమే ఈనెల 9వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9440 991668 సంప్రదించాలన్నారు.

లింగనిర్ధారణ చట్టరీత్యా నేరం



స్కానింగ్ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): లింగనిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఆయన నగరంలోని సురక్షిత స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. పీసీ పీఎన్‌డీటీ యాక్ట్ అమలు గురించి ఆరా తీశారు. చట్టాన్ని ఉల్లంఘించి పరీక్షలు చేసినా, సకాలంలో రెన్యువల్ చేయించలేకపోయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి స్కానింగ్ కేంద్రంలో ధరల పట్టిక, సేవల వివరాలు, నిబంధనల బోర్డు ప్రదర్శించాలని సూచించారు. స్కానింగ్ చేసిన వెంటనే ఫారమ్ ఎఫ్ ఆన్‌లైన్‌లో నమోదు చేసి ప్రతి నెలా 5వ తేదీలోపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయానికి పంపించాలన్నారు.

బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు, పాల్గొన్న చైర్మన్, డీఎస్పీ, ఈఓ

మహానంది: అన్నిశాఖల అధికారులు సమన్వయంతో మహానంది క్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. మహానందిలోని పోచా డార్మెటరీ భవనంలో మంగళవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఆర్డీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా చూడాలన్నారు. ఆర్టీసీ అధికారులు సరైన వేళలకు బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నంద్యాల డీఎస్పీ సి.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఉంటుందన్నారు. పార్కింగ్ వద్ద వాహనాలు, పెట్రోలు చోరీ జరగకుండా నిఘా ఉంటుందన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాలమహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రస్థాయి చెక్కభజన పోటీలు ఏర్పాటు చేశామన్నారు. గెలుపొందిన వారికి వరుసగా రూ. 50వేలు, రూ. 30 వేలు, రూ. 20 వేలు నగదు బహుమతులు ప్రదానం చేస్తున్నట్లు చెప్పారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఎడ్లబలప్రదర్శన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం దర్శన టికెట్లు ఇచ్చేందుకు ఏడు కౌంటర్లు, ప్రసాదాల టికెట్లకు నాలుగు, ప్రసాదాలు ఇచ్చేందుకు మరో నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు. వీఐపీలు, లఘు, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనాల కోసం వేర్వేరుగా ప్రత్యేక క్యూలైన్లు ఉంటాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, సీఐ రవీంద్ర, ఎస్‌ఐ నాగార్జునరెడ్డి, ఏఈఓ ఎర్రమల మధు, విద్యుత్‌శాఖ ఏఈ ప్రభాకర్‌రెడ్డి, ఆర్ అండ్‌బీ డీఈ సురేష్, అగ్నిమాపక అధికారి యోగీశ్వరరెడ్డి, డీఆర్‌ఓ సుబ్బయ్య, వైద్యాధికారి చంద్రశేఖర్, ధర్మకర్తల మండలి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు పరివర్తన చెందాలి

● జిల్లా జైలు సందర్శనలో ఎస్పీ



జిల్లా జైలు అంతర్గత భద్రతపై జైలు సెక్యూరిటీ కమిటీతో సమావేశమై చర్చిస్తున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కర్నూలు: ఖైదీలు జైలు జీవితాన్ని ఓ గుణపాఠంగా తీసుకుని పరివర్తన చెందాలని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ సూచించారు. కర్నూలు మండలం పంచలింగాల దగ్గర ఉన్న జిల్లా జైలును ఎస్పీ మంగళవారం సందర్శించి కారాగారం భద్రత, జైలు నుంచి ముద్దాయిల ఎస్కార్ట్, తదితర అంశాలపై ఆరా తీశారు. అంతర్గత భద్రతపై జైలు అధికారులు, సెక్యూరిటీ రివ్యూ కమిటీ అధికారులకు పలు సూచనలు చేశారు. కారాగారం పరిసరాలను, ఖైదీల గదులు తదితర ప్రదేశాలను పరిశీలించి ఖైదీలతో మాట్లాడి వారి నేర వివరాలు, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. విడుదలైన తర్వాత మంచి భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని ఖైదీలకు సూచించారు. అంతర్గత భద్రతపై జైలు సెక్యూరిటీ కమిటీ వారితో మాట్లాడారు. ఖైదీల కదలికల పట్ల అప్రమత్తంగా ఉండాలని, భద్రతా లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. జైలు పరిసరాలు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉన్నాయని ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేసి విజిటింగ్ బుక్‌లో సంతకం చేశారు. భద్రత రివ్యూ కమిటీ సమావేశంలో జైలు సూపరింటెండెంట్ కె.గనేనాయక్ (మెంబర్ అండ్ కన్వీనర్), జిల్లా సబ్ జైలు అధికారి నరసింహారెడ్డి (మెంబర్), ఏఆర్ డీఎస్పీ ఇలియాజ్ బాషా, జైలర్ నాగరాజు, మెడికల్ ఆఫీసర్ భాస్కర్, డిప్యూటీ జైలర్లు అనిల్‌కుమార్‌రెడ్డి, నాగరాజు, సీఐలు మురళీధర్‌రెడ్డి, రామలింగయ్య, ఆర్‌ఐ రమణ, తాలూకా ఎస్‌ఐ బాలనరసింహ తదితరులు పాల్గొన్నారు.

భారీగా కర్ణాటక మద్యం సీజ్

● రాయచూరు నుంచి పత్తికొండకు తరలిస్తుండగా పట్టివేత
● 50 బాక్సుల మద్యం, కారు సీజ్ చేసిన సెబ్ అధికారులు



పర్ల సుధాకర్ నుంచి స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యం, మారుతీ సుజుకి కారు

కర్నూలు: భారీ మొత్తంలో కర్ణాటక మద్యం పట్టుబడింది. ఈ మద్యాన్ని రాయచూరు నుంచి కర్నూలు మీదుగా పత్తికొండకు తరలిస్తున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్,డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్(డీటీఎఫ్) అధికారులకు సమాచారం అంది. కర్నూలు సెబ్ ఏఈఎస్ రాజశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో కర్నూలు సెబ్ సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ ప్రసాదరావు స్వామినాథన్ తదితరులు కల్లూరు మండలం పెద్దపాడు గ్రామ శివారులోని వక్కిలేరు బ్రిడ్జి వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. కర్నూలు వైపు నుంచి కోడుమూరు గుండా వెళ్తున్న మారుతి సుజుకి ఇకో కారులో 50 బాక్సుల్లో ఒరిజినల్ ఛాయిస్ డీలక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లు బయటపడ్డాయి. కల్లూరు మండలం పర్ల గ్రామానికి చెందిన కృష్ణ కుమారుడు తోటబలిజ సుధాకర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా రాయచూరు నుంచి పత్తికొండలో ఉన్న మధ్యవర్తికి సరఫరా చేసేందుకు తీసుకెళ్తున్నట్లు అంగీకరించాడు.

మూడేళ్లుగా యథేచ్ఛగా వ్యాపారం

పర్ల గ్రామానికి చెందిన తోటబలిజ సుధాకర్ అదే గ్రామానికి చెందిన కొంతమంది యువకులను చేరదీసి మూడేళ్లుగా యథేచ్ఛగా మద్యం వ్యాపారం నిర్వహిస్తున్నట్లు అధికారుల విచారణలో బయటపడింది. ఇందుకోసం ప్రత్యేకంగా మూడు వాహనాలు కొనుగోలు చేసి పొరుగు రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ నుంచి మద్యం జిల్లాలోకి తరలించి వ్యాపారం సాగిస్తున్నాడు. ఇతను పొరుగున ఉన్న అనంతపురం జిల్లాలోని కొన్ని గ్రామాలకు కూడా మద్యం సరఫరా చేస్తూ పట్టుబడటంతో అక్కడ కూడా కేసులు నమోదయ్యాయి. పత్తికొండ నియోజకవర్గంలోని కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లోని గ్రామాల్లో కొంతమంది ఏజెంట్లను ఏర్పాటు చేసుకుని మద్యం విక్రయాలు చేయించినట్లు బయటపడింది. పట్టుబడిన మద్యం విలువ దాదాపు రూ.5 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. తనిఖీల్లో సెబ్ సిబ్బంది వెంకటరాముడు, మాబు పీరా, కరుణాకర్, బషీర్, శంకర్ నాయక్, సుదర్శన్ రాజు, మధుసూదన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మట్కాబీటర్ అరెస్టు

– తెలంగాణ మద్యం స్వాధీనం

కర్నూలు: కర్నూలు నగరం ఆనంద్ టాకీస్‌కు ఎదురుగా హంద్రీ నదిపై ఉన్న కొత్త వంతెన (బ్రిడ్జి) దగ్గర మట్కాబీటర్ షికారి బాబు అలియాస్ బళ్లారి బాబును రెండవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. తెలంగాణ మద్యం అమ్ముతూ మట్కా రాస్తూ ఉన్నట్లు సమాచారం అందడంతో రెండవ పట్టణ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అతని వద్ద 10 ఎంసీ తెలంగాణ మద్యం బాటిళ్లతో పాటు మట్కాకు సంబంధించిన రూ.650 నగదును స్వాధీనం చేసుకున్నారు. వ్యక్తిగత లాభం కోసం మద్యం అధిక ధరకు విక్రయిస్తున్నట్లు విచారణలో అంగీకరించాడు. అతనిని కర్నూలు స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్, ప్రాహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజుల పాటు రిమాండ్‌కు ఆదేశించినట్లు రెండవ పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపారు.







సెల్‌ఫోన్ చూసి కాదు.. ముందు చూడండి బ్రదర్

● ఫైన్లే కదా.. వేసుకోండి!

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించండి.. విలువైన ప్రాణాలు కాపాడుకోండి అని అధికారులు అవగాహన కార్యక్రమాలు, ప్రచారాలు నిర్వహిస్తున్నా వాహనదారులకు చెవికెక్కడం లేదు. పట్టుకుని ఫైన్లు విధిస్తున్నా మారడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా సెల్‌ఫోన్లలో మాట్లాడుతూ కొందరు, హెల్మెట్ ధరించకుండా మరికొందరు, ఆటోలకు ఇరువైపులా కూర్చొబెట్టుకుని ఇంకొందరు ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మరికొందరు ఏకంగా నంబర్ ప్లేట్ లేకుండా ప్రయాణాలు చేస్తున్నారు.

– ఫొటోలు: వడ్డే శ్రీనివాసులు



ప్రాణాలు 'అటో'ఇటో!







పట్టుకోండి చూద్దాం: మా బండికి నెంబర్‌ప్లేట్ లేదోచ్